ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్ 2025
5
శ్రీ సత్యసాయి





హిందూపురంలో చేగువేరా చిత్ర పటానికి నూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

యువతకు స్ఫూర్తి చే గువేరా : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-హిందూపురం

అన్యాయాన్ని ప్రశ్నించి, పోరాటం సాగించిన చెగువేరాను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ ఆఫ్రీద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెగువేరా 97వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చెగువేరా పోరాటాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రజిక్, గుల్మాన్, ఉమేష్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : చేగువెరా జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈరేష్ మాట్లాడుతూ చేగువేరా అర్జెంటీనా దేశంలో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారన్నారు. వృత్తిపరంగా డాక్టర్ అయిన ఆయన 33 ఏళ్ల వయస్సులో క్యూబా పరిశ్రమల శాఖ మంత్రి అయ్యారన్నారు. ఆ తర్వాత విప్లవాన్ని విస్తరించేందుకు ఆ పదవిని వదులుకున్నారన్నారు. పేదరికం, దోపిడీలను చూసి చలించిపోయి పోరాట మార్గాన్ని ఎంచుకున్నారు. ఆ తర్వాత దక్షిణ అమెరికాలో పెరుగుతున్న సమస్యలకు సాయుధ ఉద్యమమే మార్గమని నమ్మి ఉద్యమాలు నడిపించారు. 39 ఏళ్ల వయసులో ఆయన హత్యకు గురయ్యారన్నారు. ప్రపంచవ్యాప్తంగా విప్లవకారుడనగానే చేగువెరా పేరే అందరికీ గుర్తుకొస్తుంద న్నారు. ఆయన పోరాటమే తమకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్, ప్రశాంత్, నవీన్, నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



పొలిటికల్ ఫై(హీ)ట్..!

◆ మూడు నియోజకవర్గాల్లో పరస్పర ఆరోపణలు
◆ రాజుకుంటున్న రాజకీయ వేడి



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పొలిటికల్ ఫైట్ హీట్ నడుస్తోంది. రాప్తాడు, తాడిపత్రి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధమే కాకుండా చేతల వరకు పరిస్థితులు దారితీస్తున్నాయి. నేతల మధ్య పరస్పరం దాడుల హెచ్చరికలు కొనసాగుతుండటం గమనార్హం.

రాప్తాడులో రాజకీయ రచ్చ

ముందు నుంచి రాప్తాడు నియోజకవర్గం సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. గత కొంతకాలంగా రాజకీయ రచ్చ మరింత పెరిగింది. రామగిరి ఎంపిపి ఉప ఎన్నిక నుంచి ఇది తారా స్థాయికి చేరింది. ఎంపిపి స్థానానికి ఎలాగైన దక్కించుకోవాలని అధికార టిడిపి ప్రయత్నించింది. దీన్ని తిప్పికొట్టే క్రమంలో వైసిపి గట్టిగానే నిలబడింది. దీంతో ఈ విషయంలో రెండు గ్రూపుల మధ్య వివాదం నడుస్తోంది. అంతలోనే పాపిరెడ్డిపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్త హత్య జరిగింది. ఈ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఆ సమయంలో హెలికాప్టర్ వద్ద గందరగోళం నెలకొంది. ఇది కేసుల వరకు వెళ్లింది. ఇప్పటికీ దీనిపై విచారణ కొనసాగుతోంది. ఇది ముగియకముందే రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ బాలిక అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపైనా వైసిపి ఆందోళనలు చేపట్టడం, ఆ గ్రామానికి వెళ్లేందుకు మాజీ మంత్రి మెరుగ నాగార్జున, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రయత్నించారు. ఈ విషయంలోనూ ప్రకాశ్‌రెడ్డిపై మరో కేసు నమోదయింది. ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఆయన దాని నుంచి తప్పించుకునేందుకు అజ్ఞాతంలోకి వెళ్లారు.

తాడిపత్రిలో ఆది నుంచి హైటెన్షన్..!

తాడిపత్రిలో ఎన్నికల ప్రక్రియ ముగిసినప్పటి నుంచి హైటెన్షన్ వాతావరణమే నెలకొంది. వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలో వస్తే దాడి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కూడా అనుమతి నిరాకరించడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానంలో తగిన భద్రత కల్పించి తాడిపత్రిలోకి అనుమతించాలని నిర్ధేశించింది. ప్రభాకర్‌రెడ్డి మాత్రం వస్తే దాడి జరిగే అవకాశముందని చెబుతుండటంతో పోలీసులు అనుమతించడానికి వెనుకాడుతున్నారు. తాజాగా శనివారం కూడా పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే ప్రయత్నం చేస్తే పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వస్తే ఏమవుతుందోనన్న టెన్షన్ తాడిపత్రి ప్రజల్లో నెలకొంది.

పుట్టపర్తిలో పల్లె చుట్టూ భూ వివాదం

మాజీ మంత్రి పల్లె రఘునారెడ్డికి సంబంధించి కూటమి నేత ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ భూ వివాదం తారా స్థాయిలో జరుగుతోంది. పెనుకొండ కియా పరిశ్రమ వద్ద భాగస్వామ్యంలో కొన్న 200 ఎకరాల్లో వివాదం నెలకొంది. గడిచిన ఐదారేళ్లుగా ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఇది తారా స్థాయికి చేరింది. పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఇలా మూడు నియోజకవర్గాల్లో రాజకీయ వేడి తారా స్థాయికి చేరింది.

'సూపర్ సిక్స్'ను పక్కాగా అమలు చేస్తాం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరిటౌన్



రెసిడెన్షియల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. కదిరి-హిందూపురం రోడ్డులోని మైనార్టీ పాలిటెక్నికల్ కళాశాల, గురుకుల కళాశాల భవనాల పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కదిరిలో నూతన మైనార్టీ రెసిడెన్షియల్, పాలిటెక్నిక్ కళాశాల భవనాల పనులను రూ. 18 కోట్లతో ప్రారంభించా మన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వం ఆ నిధులను ఇతర వాటికి మళ్లించడంతో ఆ పనులు ఆగిపోయాయన్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పనుల్లో వేగం పుంజుకుందన్నారు. అధికారుల సహకారంతో ఈ విద్యా సంవత్సరంలోనే పనులు పూర్తి చేసి తరగతులు ప్రారంభించేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ వారి తల్లులు ఖాతాలో డబ్బులు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైసిపి అధినేత జగన్ సొంత తల్లి, చెల్లినే ఇంటి నుంచి గెంటేశారని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం పథకంపై వెకిలి మాటలు మాట్లాడిన జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు చేస్తామన్నారు.

అండర్ బ్రిడ్జి వరకు వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం



వీధి దీపాలను ఏర్పాటును పరిశీలన చేస్తున్న ఛైర్మన్

హిందూపురం పట్టణంలో ఎస్‌డిజిఎస్ కాలేజ్ రోడ్ నుంచి గుడ్డం దేవాలయ రహదారి, అండర్ బ్రిడ్జి వరకు ఉన్న విద్యుత్ స్తంభాలకు నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. శనివారం సంబంధిత పనులను మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పరిశీలించారు. విద్యుత్ స్తంభాలకు కొత్తగా వైర్ లాగి, 32 వాట్స్ సామర్థ్యం కలిగిన ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ గుడ్డం దేవాలయంకు వెళ్లే అండర్ బ్రిడ్జి రోడ్డును విద్యుత్ దీపాలతో వెలుగులతో నింపడంతో ఈ ప్రాంతవాసులకు ఏంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైటింగ్ సూపర్ వైజర్ తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

పట్టణంంలోని త్యాగరాజ్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో స్వచ్ఛ సేవా-స్వచ్ఛ హిందూపురం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ డిఇ.రమేష్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



పెద్దారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

పెద్దారెడ్డికి మళ్లీ బ్రేక్

తాడిపత్రికి వెళ్లకుండా అడ్డగింత
పోలీసుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-యల్లనూరు

తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మరోసారి పోలీసులు బ్రేక్ వేశారు. హైకోర్టు అనుమతితో పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా శాంతిభద్రతల నేపథ్యలో ఆయన్ను అడ్డుకుంటున్నారు. శనివారం ఉదయం యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. ఈ సమయంలో పోలీసులపై పెద్దారెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని, అయినా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పోలీసులు జెసి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలను పాటిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భయంతోనే అడ్డగింత : పెద్దారెడ్డి

తాను తాడిపత్రికి వెళ్తే జెసి.ప్రభాకర్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ఉండదని కారణంతో పోలీసుల చేత తనను పదేపదే అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి తెలిపారు. గృహ నిర్బంధం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి తనను తాడిపత్రికి రానీయకుండా తన అనచరులను రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. శాంతి భద్రతలకు విఘాతం ఎవరు విఘాతం కలిగిస్తున్నారో పోలీసులకు బాగా తెలుసన్నారు. చట్టాన్ని తాను గౌరవిస్తున్నాను కాబట్టే ప్రతి సారి పోలీసులు చెప్పినట్లు వింటున్నానని తెలిపారు.

ఏకపక్ష ఉద్యోగోన్నతులు సరికాదు

వాటిని తక్షనం రద్దు చేయండి - కమిషనర్‌ను కోరిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం



కమిషనర్ మల్లికార్జునను సన్మానిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

గత కొన్ని నెలలుగా హిందూపురం పురపాలక సంఘంలో పాలకులకు తెలియకుండా అధికారులు ఏకపక్షంగా ఇచ్చిన పదోన్నతులు అక్రమమని, వాటిని రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కౌన్సిలర్లు కోరారు. శనివారం మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ ఛాంబర్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్‌తో కౌన్సిలర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు గిరీష్, రాఘవేంద్ర తదితరులు పురపాలక సంఘంలో వివిధ విభాగాల్లో అధికారులు ఏకపక్షంగా పాలకవర్గానికి కనీస సమాచారం ఇవ్వకుండా ఉద్యోగోన్నతులు కల్పించారన్నారు. వెంటనే వీటిని రద్దుచేసి నూతనంగా నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. ఆప్కాస్ కింద విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను 60 సంవత్సరాలు పూర్తి కావడంతో కొంతమందిని తొలగించారని, వీరి స్థానంలో ప్రథమ ప్రాధాన్యత కింద వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ఉన్న సచివాలయాల్లో కొందరు సిబ్బంది ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల మధ్య సమన్వయ లోపం ఉందని దీంతో కార్యాలయంలో పనులు త్వరతగితిన పూర్తి కావడం లేదని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పట్టణ జనాభాకు తగ్గట్టు కార్మికుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై కమిషనర్ స్పందిస్తూ పట్టణ జనాభాకు అనుగుణంగా కౌన్సిల్ సహకారంతో కార్మికుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు చేపడతామన్నారు. సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా ప్రతినిధులను గుర్తించేలా వారికి సూచిస్తామన్నారు. ఇప్పటికే పట్టణ అభివద్ధి కోసం రూ. 92.50 కోట్లు పరిపాలన మంజూరు అయ్యాయని, కౌన్సిలర్ల సూచనల మేరకు నిధులను కేటాయింపు చేసి పట్టణాన్ని అభివద్ధి పథంలో నడిపించు కుందామన్నారు. ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వార్డుకు రూ. 3 లక్షలు కేటాయించి, ప్రజలకు అవసరమైన చిన్న చిన్న పనులు అన్నింటినీ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. మరో రెండు నెలల్లో వినాయక ఉత్సవం ఉందని, ఆ ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేపట్టాలని కౌన్సిలర్ రాఘవేంద్ర కోరారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన మున్సిపల్ వాణిజ్య భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

బాబా సమాధిని దర్శించుకున్న జనసేన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జనసేన పార్టీ ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, నిమ్మక జయకృష్ణ శనివారం ప్రశాంతి నిలయంలో సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. వారు పుట్టపర్తి చేరుకోగానే ముందుగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, జనసేన నాయకులు ఘనంగా స్వాగతం తెలిపారు. అనంతరం వారు బాబా సమాధిని సందర్శించి పట్టణంలోని టిడిపి కార్యాలయానికి చేరుకోగా టిడిపి, జనసేన నాయకులు వారిని శాలువాలతో సన్మానించి బాబా చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడు తూ ఇటీవల గోరంట్ల మండలంలోని కళ్లితండాకు చెందిన జవారు మురళీనాయక్ శత్రు దేశం పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందిన సంగతి తెలిసిందే అన్నారు. వీరజవాను అంత్యక్రియల్లో పాల్గొన్న జనసేనపార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జవాను తల్లిదండ్రులను పరామర్శించ డంతో పాటు ఆ కుటుంబానికి రూ. 25 లక్షలు ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన తన సొంత నిధులతో చెక్కు పంపించగా తాము జవాను తల్లిదండ్రులకు ఆ చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బేకరీ నాయుడు, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేలకు బాబా చిత్రపటం అందిస్తున్న పల్లె రఘునాథరెడ్డి



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రక్తదానంలో యువత ముందుండాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆపద సమయంలో రక్తదానం చేయడానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ అసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో బ్లడ్ బ్యాంకు, చైతన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారితో పాటు సామాజిక సేవకులను సన్మానించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ, ఆర్ఎంఒ డేవిడ్ రాజు, రక్త నిధి వైద్యులు చరణ్, చైతన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగిరెడ్డి, ఫ్రీడమ్ ఫైటర్ టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం వ్యవస్థాపకులు ఉమర్ ఫారూక్ ఖాన్‌లు రక్తదానం ఆవశ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య సంస్థ ప్రోగ్రాం మేనేజర్ తిప్పేస్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నవీన్ కుమార్, చైతన్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దంలో ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంలో ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుతుండడంతో ఆ మార్గం లో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో అంబేద్కర్ సర్కిల్‌లోని మలుపులో రోడ్డు పక్కనే వాహనాలు పార్కింగ్ చేయడం, ఎరువుల దుకాణాలు రోడ్డు పక్కనే ఉండడంతో స్టాక్ తీసుకొచ్చిన పెద్ద వాహనాలు రోడ్డుపైనే నిలపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా, పగల దుకాణాల ముందు పెద్ద పెద్ద వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

'తల్లికి వందనం' చారిత్రాత్మకం

ప్రజాశక్తి-హిందూపురం



బాబు, పవన్, బాలయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం చారిత్రాత్మకమని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ పేర్కొన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లులు ఖాతాల్లోకి నగదు జామ అయిన సందర్భంగా శనివారం పట్టణంలోని నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం అభినందనీయం అన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతున్నా అందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో జాప్యం..!

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులో నాలుగు రోడ్లకు ఇరువైపులా ఆక్రమించుకున్న వాటిని తొలగించడానికి కలెక్టర్ చేతన్ ఆదేశాల మేరకు ఆర్అండ్ బి అధికారులు, పంచాయతీ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. గడువు వారం రోజులు విధించగా అది కూడా పూర్తయింది. అయితే దుకాణాల ముందు ఉన్న రేకులను తొలగించుకోవాలని పంచాయతీ అధికారులు వారికి తెలియజేయడంతో కొందరు దుకాణాలు ముందు ఉన్న రేకులను తొలగిస్తున్నారు. అయితే ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తారో లేదో అని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కాగా రాజకీయ ఒత్తిళ్లతోనే ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అధికారులు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. బుక్కపట్నం రోడ్డు, పెనుకొండ రోడ్డుకు ఇరువైపులా పలువురు చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తుండడం వల్ల నిత్తయం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ విషయమై ఆర్అండ్‌బి జెఈ పొన్నూరుస్వామిని వివరణ కోరగా వ్యాపారులు, ప్రజల విన్నపం మేరకు మంగళవారం వరకూ గడువు పొడిగించామని తెలిపారు.

కంటి జబ్బులపై జాగ్రత్తలు అవసరం



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-హిందూపురం

కంటికి సంబంధించిన జబ్బులపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రినిటీ సర్వీసెస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి సూచించారు. శనివారం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు రేణు, నిఖిత, శ్రవంతిలు కంటి జబ్బులతో బాధపడుతున్న బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 570 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 220 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ బెంగుళూరులోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు, కంటి అద్దాలను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ నరసింహా మూర్తి, రహమతుల్లా, క్యాంప్ ఇన్‌ఛార్జి శివ ప్రకాష్, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

16 నుంచి విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు


డాక్టర్ సంకారపు నరసింహులు

ధర్మవరం రూరల్ : పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ నెల 16 నుంచి జులై 15వ తేదీ వరకూ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కంటి వైద్య నిపుణులు, రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి సంకారపు నరసింహులు తెలిపారు. పట్టణంలోని మధు కంటి వైద్యశాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చక్కటి కంటిచూపు -చక్కటి విద్యకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళ్లజోడు వాడుతున్న వారు ఏడాదికి ఓ సారి కంటి పరీక్షలు చేయించు కొని, అందుకనుగుణంగా కళ్లజోడు మార్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల కంటి చూపు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పాఠశాలలో బోర్డుపైన అక్షరాలు సరిగా కనపడని వారు వెంటనే కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అందులో దృష్టి లోపం ఉన్నట్లు తేలితే తప్పకుండా కళ్లజోడు వాడాలన్నారు. ఉచిత కంటి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24న మెగా జాబ్ మేళా

ధర్మవరం రూరల్ : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సంస్కృతి సేవా సమితి సౌజన్యంతో ఈ నెల 24వ తేదీ పట్టణంలోని సిఎన్‌బి కళ్యాణ మండపంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 50కి పైగా ప్రఖ్యాత కంపెనీలు పాల్గొంటాయని, 2వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్హత పత్రాల జిరాక్స్, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 96032 32977 లో సంప్రదించాలన్నారు.


మైత్రి

జిల్లా క్రికెట్ జట్టుకు బాలిక ఎంపిక

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఆర్‌డిటి స్పోర్ట్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న మైత్రి జిల్లా అండర్-19 బాలికల క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్‌డిటి క్రికెట్ కోచ్ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అండర్-19 బాలికల క్రికెట్ జట్టు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ నెల్లూరులో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు. మైత్రి మాట్లాడుతూ ఆర్‌డిటి ఇస్తున్న ఉచిత కోచింగ్, ప్రోత్సాహంతోనే తాను జిల్లా జట్టుకు ఎంపికయ్యాయని తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

ధర్మవరం రూరల్ : పట్టణంలో శనివారం లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సర నూతన కార్యవర్గాన్ని ప్రస్తుత లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.వేణుగోపాలా చార్యుల అధ్యక్షతన ఎన్నుకున్నారు. లయన్స్ సభ్యులు క్లబ్ అధ్యక్షులుగా ఆకులేటి రమేష్‌బాబు, సెక్రటరీగా వి.నాగేంద్ర, ట్రెజరర్‌గా కె.వెంకటేష్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ పి.వెంకటస్వామి, జి.మోహన్‌దాస్, పళ్లెం వేణుగోపాల్, గోసె రాధాకృష్ణ, జి.రాజగోపాల్, పుట్లూరు నరసింహులు, పి.రాజీవ్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. లయన్స్ సేవలను విస్తృతం చేయాలని కోరారు. అలాగే లయన్స్ క్లబ్ నూతన సభ్యులుగా బండి బాబు, ఎం.వెంకటపార్థసారథి, ఆర్‌జి.వెంకటేషులుకు సభ్యత్వం కల్పిస్తూ తీర్మానం చేశారు.


యోగాసనాలు వేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అధికారులు,

యోగాతో ఆరోగ్య పరిరక్షణ : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రతి రోజూ యోగా సాధన వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి సాధ్యపడుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతి గృహం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జెసి పాల్గొని యోగాసనాలు వేశారు. జెసి మాట్లాడుతూ రోజూ ఒక గంట యోగాసనాలు వేయడం వల్ల మానసిక ప్రశాంతతకు శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా ఈ నెల 21వ తేదీ జిల్లాస్థాయిలో లేపాక్షిలో యోగా డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు వైజాగ్‌లో పెద్ద ఎత్తున జరిగే యోగాలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, పుర ప్రజలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంగులయ్య, కదిరి డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.రామ్‌ప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న చిరుద్యోగులకు తల్లికి వందనం వర్తింపచేయాలని కోరారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని శివాలయం వీధి సమీపంలో శనివారం 'తల్లికి వందనం' లబ్ధిదారులు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు సిఎం చంద్రబాబు ప్రతి కుటుంబంలో ఎంత మంది చదువుతున్నా వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ. 13వేలు నగదు విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. దీంతో లబ్ధి పొందిన విద్యార్థుల తల్లులు సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీధర్, నరేష్, అజంతుల్లా, శ్రీనివాసులు, ఉత్తమరెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం డబ్బు జమ కావడంతో స్థానిక మైనార్టీ కాలనీలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణ్ నాయుడు, మైలే రామచంద్ర, మస్తాన్, ప్రకాష్, అరవింద్‌బాబు, పూల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో విద్యార్థికి రూ. 13వేల చొప్పున జమ చేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రారంభంలోనే ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో పిల్లల చదువుకులకు ఫీజులు, అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడానికి దోహదపడుతుందని పేర్కొంటున్నారు. వారు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లులు

అఘాయిత్యంపై ఆందోళన..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ వారంలో అమ్మాయిలపై జరిగిన అఘాయిత్యం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇదే ప్రధానమైన అంశంగా ముందుకొచ్చింది. అటు అధికారి, విపక్ష పార్టీలు రెండూ ఈ సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాయి. సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో ఒక మైనర్ బాలికను రెండేళ్లగా అత్యాచారానికి పాల్పడిన ఘటన బయటకొచ్చింది. ఏకంగా 16 మంది బాలికను భయపెట్టి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్టు పోలీసు విచారణలో తేలడంతో వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారు. ఈ చర్చ నడుస్తున్న క్రమంలోనే అనంతపురం నగరంలో యువతి పెళ్లి చేసుకొమ్మన్నందుకు బండరాయితో మోది హత్య చేసిన ఘటన బయటకొచ్చింది. నాలుగు రోజుల క్రితం అమ్మాయి తప్పోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో ఈ ఘాతుకం జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో సిఐ రాజేంద్రనాథ్‌ను పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ రెండు ఘటనలు వరుసగా చోటు చేసుకోవడంతో మహిళల భద్రతపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. మహిళలపై జరిగిన దాడులను పరిశీలించేందుకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ విచ్చేశారు. బాధితులను కలిసి పరామర్శించి వెళ్లారు. సిపిఎం ఆధ్వర్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసనలు కొనసాగాయి. ఇక వైసిపి కూడా ప్రభుత్వ వైఫల్యం అంటూ పెద్దఎత్తున నిరసనలకు దిగింది. అనంతపురం నగరంలో ర్యాలీలు నిర్వహించగా, ఏడుగుర్రాల పల్లికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మాజీ మంత్రి మెరుగ నాగార్జున, సాకే శైలజాథ్, ఉషచరణ్ శ్రీ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిలు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని వారిని మధ్యలోనే అరెస్టు చేసి వెనక్కు పంపించారు. ఈ రెండు ఘటనలు వరుసగా జరగడంతో రాష్ట్ర వ్యాప్తంగానూ ఈ అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

ఈ వారంలో వర్షాలు పడటం ఖరీఫ్ సాగుకు కొంత సానుకూలంగా మారింది. జూన్ ప్రారంభం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు మే ఆఖరిలో పడినంతగా, జూన్ ఆరంభంలో పడలేదు. రెండవ వారంలో ఒక మోస్తరు వర్షపాతం జిల్లా వ్యాప్తంగా నమోదయింది. దీంతో సాగుకు రైతులు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నాయి. వేరుశనగ సబ్సిడీ విత్తన పంపిణీ కూడా ఆరంభమైంది. రైతులు పెద్దగా వేరుశనగ విత్తన కొనుగోలుకు ఆసక్తి చూపకపోవడం శోచనీయం. ఆముదం, జొన్న, మొక్కజొన్న , కంది పంటల వైపు ఎక్కువగా మొగ్గు చూపే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం తల్లికివందన పేరుతో విద్యా కానుక డబ్బులను తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దీని కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తూ వచ్చారు. ఇప్పుడు ఖాతాల్లోకి డబ్బులు పడటంతో ఒకింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ సమస్యలున్నా ఈ నెలాఖరులోపు వాటిని పరిష్కరించుకుంటే వారికి కూడా డబ్బులు పడతాయని విద్యా శాఖ చెప్పడంతో రాని వారు వాటిని సరిచేసుకునే పనిలో పడ్డారు. ఇక ఖరీఫ్ సీజన్ ఆరంభంలో ఇచ్చే రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. అది కూడా ఈ నెలలోనే వేస్తామని మహానాడు సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. అది కూడా వస్తే ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు కొంత చేదోడు అయ్యే అవకాశముంది.

నవసమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

నవసమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపు నిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందికుంట ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పద న్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతారని, అటువంటి పరిస్థితుల్లో మేమున్నామంటూ ముందుకొచ్చి రక్తదానం చేసే రక్తదాతలు ఎల్లకాలం గుర్తుంటారన్నారు. రక్తదాన శిబిరంలో సహాయ సహకారాలు అందించిన అఖిల భారత చిరంజీవి యువత, రామ్‌చరణ్ యువశక్తి రాష్ట్ర టీమ్ సభ్యులు, రెడ్ ప్లస్, శ్రీఖాద్రీ లక్ష్మీనృసింహ సేవా సమితి, కెఐకె సంస్థ, ఫ్రెండ్స్ టు సపోర్ట్ టీం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వివిఎస్.శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి వివిధ స్వచ్ఛంధ సంస్థల తరపున పలుమార్లు రక్తదానం చేసిన రక్త దాతలు, ఆర్గనైజర్లకు ప్రశాంత పత్రాలు అందించి అభినందించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

హిందూ శ్మశానవాటిక ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో ప్రస్తుతం ఉన్న హిందూ శ్మశానవాటికలో స్థల కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పట్టణ ప్రజలు మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు శనివారం ఫోనిక్స్ కంపెనీ ప్రతినిధి రుద్ర కుమార్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పట్టణ శివారులోని డంప్‌యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ ప్రాంతం శ్మశాన వాటిక ఏర్పాటుకు అత్యంత అనువైందిగా గుర్తించారు. అలాగే ఇప్పటికే ఉన్న పాత శ్మశానవాటికను కూడా పరిశీలించి అక్కడ అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. వారి వెంట మున్సిపల్ డీఈ వీరేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, నాయకులు చంద్ర, సాకే ఓబులేష్, నబిరసూల్, బిల్లే శ్రీనివాసులు, డోలా రాజారెడ్డి, వీరనారప్ప, జూటూరు వెంకటేష్, పోతుకుంట రాజు, చంద్రమౌళి, నారప్ప, పవన్‌కుమార్‌రెడ్డి, చంద్ర మహేష్, బోయ నర్సింహులు, వడ్డే శీన, తదితరులు పాల్గొన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రూరల్ మండలంలోని పోతుకుంట బృందావన కాలనీలో శనివారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో కలిసి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పేకాట, తదితర జూదం జోలికి వెళ్లవద్దని సూచించారు. మద్యానికి బానిస కాకూడదని, మహిళలు, చిన్న పిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.


క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మునిచంద్రిక

క్షయపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కప్పలబండ గ్రామంలో శనివారం డాక్టర్ ముని చంద్రిక ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె క్షయ లక్షణాలు, నివారణ మార్గాలు, మందులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. రెండు వారాలకు మించి దగ్గుతో పాటు గళ్ల పడడం, ఛాతిలో నొప్పి, ఉదయం, సాయంత్రం జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి ఉన్న వారికి ఉచిత వైద్య సదుపాయం, పౌష్టికాహారం కోసం నెలకు రూ. 6వేలు అందజేస్తారన్నారు. క్షయ వ్యాధి వారితో పాటు సన్నిహితంగా ఉన్న వారికి సివైటిబి పరీక్షలు చేయాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని కోరారు.

ఆరుబయలు ప్రాంతాల్లో డ్రోన్ తనిఖీలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు శనివారం పుట్టపర్తి పోలీసులు అటవీ ప్రాంతంలో డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మండలంలోని అమగొండపాలెం, కర్నాటక నాగేపల్లి, కోట్లపల్లి, పైపల్లి, నిడిమామిడి ప్రాంతాల్లోని శివారు ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో నేరాలకు తావు లేకుండా డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో రూరల్ ఎస్ఐ లింగన్న, పోలీసు సిబ్బంది స్టేషన్ పరిధిలో డ్రోన్ ఎగురవేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి, పేకాట, ఈవ్ టీజింగ్, తదితర నేరాలు జరగకుండా శివారు ప్రాంతాలతో పాటు తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి డ్రోన్ పంపి నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టే వేసే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు.

కొంకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కొంకల్లు గ్రామ సమీపంలో వెలసిన పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రతి శని, సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వచ్చి పూజలు నిర్వహించి అన్నదానం చేస్తుంటారు. అర్చకులు ఉదయం 7 గంటలకే స్వామివారికి అభిషేకాలు చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కర్నాటకకు చెందిన పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నదానం ఏర్పాటు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-మడకశిర

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రమైన రొళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ ఎస్.షెక్షావలి, ఎంపిడిఒ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వివిఎం.పాండు రంగప్ప, మార్కెట్ యార్డు ఛైర్మన్ గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, కార్యదర్శి ఈరన్న, రామక్రిష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న అధికారులు, నాయకులు

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. మండలంలోని బుగ్గానిపల్లి గ్రామానికి చెందిన నంజుండప్ప(50) ద్విచక్ర వాహనంపై గోరంట్ల నుంచి స్వగ్రామం వెళ్తుండగా ముద్దులకుంటపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ ద్విచక్ర వాహంపై గుమ్మయ్యగారిపల్లి నుంచి గోరంట్లకు వస్తుండగా పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నంజుండప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ప్రకాష్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కార్మికుల సమస్యలపై జులై 9వ తేదీ సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్ ఆదినారాయణ, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు డి.చంద్రకళ, మున్సి పల్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.బాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం, 29 కార్మిక చట్టాలు, 8 గంటల పని విధానం కొనసాగింపు, నాలుగు కార్మిక కోడ్‌ల రద్దు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లు, తదితర డిమాండ్లతో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్.హైదర్‌వలి, ఓబులేసు, దీన, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

ప్రజాశక్తి-కదిరి టౌన్


ప్రయాణికురాలికి బంగారు గొలుసు అందజేస్తున్న కండక్టర్ సురేందర్

కదిరి నుంచి కర్నాటకలోని బిల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు బంగారు గొలుసు పోగొట్టుకుంది. అది గుర్తించిన కండక్టర్ సురేందర్ ప్రయాణికురాలికి బంగారు గొలుసు అందజేసి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. కదిరి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఓ బస్సు కర్నాటకలోని బిల్లూరుకు బయల్దేరింది. తుమ్మల ఉన్నత పాఠశాలలో పని చేసే ఫిజిక్స్ ఉపాధ్యాయు రాలు కదిరిలో ఆ బస్సులో ఎక్కి తన గమ్యస్థానంలో దిగి వెళ్లిపోయింది. బస్సు బిల్లూరుకు చేరుకోగానే ప్రయాణికులందరూ దిగి వెళ్లిపోయారు. కండక్టర్ కెహెచ్ సురేందర్‌కు ఓ బంగారు గొలుసు దొరికింది. తిరుగు ప్రయాణంలో తుమ్మల వద్ద వేచి ఉన్న ఉపాధ్యాయురాలు తన గొలుసు పోయిన విషయాన్ని కండక్టర్ సురేందర్‌కు తెలిపింది. దీంతో కండక్టర్ పూర్తి వివరాలు తెలుసుకొని స్థానికుల సమక్షంలో ఉపాధ్యాయురాలికి బంగారు గొలుసు అప్పటించారు. దీంతో కండక్టర్ నిజాయితీని ప్రయాణికులతో పాటు కదిరి డిపో ఆర్టీసీ అధికారులు పెద్దన్న, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నబిరసూల్, నాగార్జునరెడ్డి, జివైపి.రావు, శ్రీనివాసులు, ఆర్ఎస్.రెడ్డి, పి.శంకరప్ప, శోభారాణి, కె.దివాకర్, ఎం.కొండారెడ్డి, కె.హరికుమార్ అభినందించారు.

రైతుల శ్రేయస్సే ముఖ్యం : 'చిలకం'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైతుల శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండలంలోని రేగాటిపల్లి గ్రామ పంచాయతీలో శనివారం చేపట్టిన విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమానికి చిలకం ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు విత్తన వేరుశనగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చిలకం మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి రైతుకు మద్దతుగా నిలుస్తుందన్నారు. ఇదిలా ఉండగా మృగశిర కార్తి సందర్భంగా పోతుకుంట గ్రామ రైతులు ఏరువాక సేద్యానికి పొలాలను సిద్ధం చేశారు. పంట పొలాల్లో పూజలు చేసిన రైతులు వరి, వేరుశెనగ పంటల కోసం భూమిని చదును చేసుకుంటున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డిష్ రాజు, చిలకం వెంకటరెడ్డి, బాబురెడ్డి, రైతులు ఆదిరెడ్డి, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.


విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న 'చిలకం'

వైసిపి బలోపేతానికి కృషి చేద్దాం : కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆ పార్టీ పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడిగా కోటిరెడ్డి బాల్‌రెడ్డితో పాటు పట్టణ కమిటీని కూడా నియమించారు. దీంతో శనివారం పట్టణంలోని కేతిరెడ్డి నివాసంలో వారు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మద్దిలేటి మల్లికార్జున, కత్తే పెద్దన్న, నాయకులు చాంద్ బాషా, సుబాన్ బాషా, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయి కుమార్, చింతా మారుతి, కడప రంగస్వామి, గోరకాటి పురుషోత్తం రెడ్డి, బాలం గోపాల్, బడన్నపల్లి కేశవరెడ్డి, తిరుమల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


కేతిరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుడికి పరామర్శ

పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన వైసిపి వార్డ్ ఇన్‌ఛార్జి కుమారస్వామి అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఘనంగా సత్యసాయి పాదుక గ్రామోత్సవం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని సత్యసాయి సహస్ర మహా గ్రామ సేవ మహా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో పాదుక గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 360 గ్రామాల్లో పాదుక గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. స్థానిక హనుమాన్ సర్కిల్ వద్ద సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవంబర్ 23వ తేదీ వరకు జిల్లాలోని గ్రామాల్లో సాయి పాదుక దర్శనం, నగర సంకీర్తన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమూర్తి, సాయి భక్తులు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో పాల్గొన్న సాయి భక్తులు

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి-నల్లమాడ

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నాయకులు మండలంలోని చేరవాండ్లపల్లి సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ సుమారు 8 వారాలుగా వేతనాలు అందలేదని, తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. స్పందించిన కదిరిప్ప వేతనాల విషయమై ఎంపిడిఒతో మాట్లాడి వెంటనే అందేలా చూస్తామని తెలిపారు. అలాగే మిగిలిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, కె.రామచంద్ర, బి.నాగేంద్ర, ఎం.రామాంజనేయులు, పి.గంగాద్రి, మూడే బాలాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై విమర్శలు తగదు : వైసిపి

ప్రజాశక్తి-నల్లచెరువు

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌ను విమర్శించే స్థాయి టిడిపి నాయకులకు లేదని వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం తన నివాసంలో ఆ పార్టీ మండల నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. మండల టిడిపి నాయకులు జగన్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైసిపి హయాంలో ఏడాది లోపే ఇచ్చిన హామీల కంటే ఎక్కువ పథకాలు అమలు చేయడంతో పాటు ఇంటి వద్దకే పాలన అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపిదే అన్నారు. ఇకనైనా టిడిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు మాని ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైపు దృష్టి పెట్టాలని హితవు పలికారు. వైసిపి సీనియర్ నాయకులు నరసింహా రెడ్డి మాట్లాడుతూ తాను ఓరువాయు పంచాయతీలో దేవాదాయ భూములు ఆక్రమించినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమన్నారు. చట్ట పరంగానే గతంలో ఇతరుల నుంచి కొనుగోలు చేశామన్నారు. సమావేశంలో నాయకులు బావాఖాన్, నాగభూషణం, పోరెడ్డి వెంకటరెడ్డి, హైటెక్ రమణ, యనమల ఆనంద్‌రెడ్డి, పల్లె వెంకట్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సద్దపల్లి రఫీ, అక్బర్, శ్రీనివాసులు, యల్లప్ప, రమణ, వెంకటరమణ, గోపాల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు